క్లుప్తంగా

జన్నారం @42



నిర్మానుష్యంగా జన్నారం ప్రధాన రహదారి

జన్నారం: ఎండలు మండుతున్నాయి. భయంతో ప్రజలు భయటకు రాని పరిస్థితి ఏర్పడింది. జన్నారం మండలంలో ఆదివారం భానుడు భగభగా మండాడు. జన్నారంలో 42డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం కాస్త మబ్బులు కమ్ముకున్నా, ఆదివారం ఎండ తీవ్రంగా ఉంది. దీంతో మధ్యాహ్నం సమయంలో రోడ్ల మీద జనం కనిపించకుండా నిర్మానుషంగా మారాయి. ఎండ తీవ్రతకు రోడ్లపైకి జనం రావడం లేదు. అత్యవసరం అయితే తప్పా, ఎవ్వరూ బయటకు రావద్దని వైద్యులు పేర్కొంటున్నారు.

‘అధిక ధరలకు మద్యం అమ్మకాలు’

చెన్నూర్: పట్టణంలో మద్యం వ్యాపారులు మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మద్యం విక్రయాలు విక్రయించాల్సి ఉండగా, బాటిల్ పై రూ. ఐదు నుంచి రూ. పది ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని ఆదివారం కాంగ్రెస్ నాయకుడు సుశీల్‌కుమార్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మద్యాన్ని వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నా, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను చలివేంద్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందిస్తూ మరింతగా చేరువ కావాలనే లక్ష్యంగా కొక్కిరాల రఘుపతి ట్రస్ట్ ఆధ్వర్యంలో డీసీసీ వైస్ చైర్మన్ మాధవరపు రాజేశ్వర్‌రావు ఏర్పాటు చేసిన చలివేంద్రంను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డేగ బాపు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొట్టె మహేందర్, కొటి సత్తయ్య, మల్యాల రాజ్‌కుమార్, ఒడ్డె శ్రీనివాస్, నాయికిని సురేందర్, శ్రీనివాసగౌడ్ తదితరులు ప్రారభించారు.

అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: ఎండల తీవ్రత పెరుగుతున్నందున గ్రామాల్లో నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పొనకల్, శ్రీలంక కాలనీ ప్రాంతాలలో ఆదివారం పర్యటించారు. అన్ని గ్రామాల కార్యదర్శులు నీటి సమస్య ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలుపాలని సూచించారు. ఏఈ అబురమ్, ఈవో రాహుల్ ఉన్నారు.

భూమిపూజ

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామపంచాయతీలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు ఆదివారం మాలీ సంక్షేమ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. మహాత్మాజ్యోతిరావుపూలే దంపతులు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కన్నెపల్లి మండల మాలీ సంక్షేమ సంఘం నాయకులు, కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందిస్తున్న వాకర్స్ సభ్యులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన శివార్ల సాయమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10వేల సాయం అందించారు. సాయమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో తమవంతు సాయం అందించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు భూమేష్, కుమార్, సురేష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్ సరస్వతి శిశుమందిర్ ఏరియాలోని తలిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆదివారం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ వాకర్స్ సభ్యులు సేకరించిన రూ.22వేల నగదును అందించారు. కార్యక్రమంలో రాజశేఖర్, జాకీర్, సంజీవ్, సత్యం, రాజు, తిరుపతి తదితరులున్నారు.

బియ్యం అందజేత

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి సుందిళ్ల మాళవిక వివాహానికి మండల కాంగ్రెస్ నాయకులు బుక్యా లక్ష్మణ్, వేల్పుల శ్రీనివాస్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షెడంశెట్టి రమేష్‌లు ఆదివారం 75కిలోల బియ్యాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

పరీక్షే ప్రామాణికం..!

- పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లు పంపిణీ
- కార్యదర్శులకు ఇప్పటికే అవగాహన
- చేతిపంపులు, బావులు, ‘భగీరథ’ నీటికి పరీక్షలు
- స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

జిల్లా సమాచారం		
భగీరథ నీటి ట్యాంకులు	:	985
నల్లా కనెక్షన్లు	:	1.28.610
చేతిపంపులు	:	3,583



నల్లా నీటిని పరీక్షిస్తున్న దృశ్యం(ఫైల్)

అన్ని పంచాయతీలకు కిట్లు అందించాం..

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు నీటి పరీక్ష కిట్లను అందించాం. వాటి నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాం. పరీక్షలు జరిపే తీరుపై పర్యవేక్షణ చేస్తున్నాం. కిట్ల ద్వారా నీటిని పరీక్షిస్తే లోపాలు వెంటనే తెలిసిపోతుంది. అంతే కాకుండా నీటి సరఫరాకు ఆటంకం కలిగితే ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నాం.

\- వెంకటేష్, ఈఈ,
గ్రామీణ నీటి సరఫరా విభాగం

దండేపల్లి: ఎండలు మండిపోతున్నాయి.. దీంతో నిత్యం వాడే మంచినీటికి ప్రాధాన్యత ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు భగీరథ నీరు సరఫరా జరుగుతోంది. కొన్నిచోట్ల బోరుబావుల నుంచి లేదా ప్రత్యామ్నాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పైపులైన్ల లీకేజీ, ట్యాంకుల అపరిశుభ్రతతో అక్కడక్కడా నీరు కలుషితం అవుతుందనే వాదన కూడా వినిపిస్తోంది. దీంతో నీరు కలుషితం కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లోనే తాగునీటిని పరీక్షించేందుకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లను అందించారు. చేతిపంపులు, మంచినీటి బావులు, ఇతర పథకాల నీటిని పరీక్షించేందుకు అందించిన క్లోరోస్కోప్ కిట్ల వినియోగంపై పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. పరీక్ష కిట్ల ద్వారా ప్రజలు నిత్యం వినియోగిస్తున్న నీటిలో ప్రమాణాలు ఏయే మేరా ఉన్నాయో వెంట వెంటనే తెలిసిపోతుందని గ్రామీణ నీటిసరఫరా అధికారులు పేర్కొంటున్నారు.

తేడాలుంటే ప్రత్యామ్నాయం..

వాటర్‌ట్యాంకులు, చేతిపంపులు, మంచినీటి బావుల నీటి నాణ్యత పరీక్షలపై పారదర్శకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీ తాగునీటి వనరు వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పరీక్ష నివేదిక ఆధారంగా నీరు తాగేందుకు పనికొస్తుందా..? లేదా..? అన్న వివరాలు నమోదు చేయాల్సి వస్తుంది. నాణ్యతలో తేడా వస్తే, అక్కడ సమీపంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తాగునీటిని అందించనున్నారు.

వినియోగిస్తేనే సార్థకత..

అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి జీపీకో నీటి నాణ్యత పరీక్ష కిట్లు సరఫరా చేసింది. వాటి నిర్వహణపై పంచాయతీ సిబ్బందికి నైపుణ్యం లేకపోవడంతో, వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో వాటిల్లోని రసాయనాలు, కరిగి పనికి రా కుండా పోయాయి. అంతే కాకుండా అప్పట్లో పంచాయతీ కార్యదర్శుల కొరత కూడా ఉండేది. రెండు, మూడు జీపీలకు ఒక కార్యదర్శి ఉండేది. ఇప్పుడు పంచాయతీకో కార్యదర్శి ఉండటంతో నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. అంతే కాకుండా కిట్లలోని రసాయనాలు అయిపోతే, పంచాయతీల నుంచి కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షల కిట్లను వినియోగిస్తేనే సార్థకత ఉంటుంది. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

తాగునీటి వృథాను అరికట్టరా..?





హైటెక్‌సిటీ కాలనీలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

మంచిర్యాలటౌన్: వేసవి కాలంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో తాగునీటి పైపులు లీకేజీతో రోడ్లపై బురద గుంటలు ఏర్పడడంతో పాటు, రోడ్ల పైకి తాగునీరు పారుతూ వృథా అవుతున్నా, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీటి సరఫరాను కాలనీలో ప్రారంభించిన కొద్ది సేపటికే, కాలనీలోని పలు రోడ్లు జలమయం అవుతున్నాయి. లీకేజీలతో గోదావరి తాగునీరు రోడ్డుపై పారుతూ కొన్ని నెలలుగా వృథా అవుతున్నా, వాటికి మరమ్మతులను చేయడం గాని, సమస్యను పరిష్కరించడం గాని చేయడం లేదు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకముందే, తాగునీటి లీకేజీల సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా జలీల్



నియామకపత్రం అందుకుంటున్న జలీల్

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నెన్నెల మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన మహ్మద్ జలీల్ నియమితులయ్యారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చేతుల మీదుగా జలిల్ మంచిర్యాలలో ఆదివారం నియామకపు పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో యూత్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వంశీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో తన ఎన్నికకు సహకరించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, పెద్దపల్లి సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరుణ్‌వాల్మికి , మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, బెల్లంపల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్, యువజన కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి రాజ్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

హెచ్‌ఎంఎస్‌లో పలువురి చేరిక



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న రియాజ్ అహ్మద్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలువురు ఉద్యోగులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ హాజరై ఉద్యోగులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘాలతో రాజకీయ జోక్యం పెరిగి సింగరేణిలో అవినీతి పెరిగిపోతుందని ఆరోపించారు. యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేదని, కార్మిక హక్కులే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గెలిచిన యూనియన్‌కు వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, నాయకులు వెల్ది సుదర్శన్ గౌస్, శ్రీనివాస రెడ్డి, జే. శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

చేనేని భీమయ్య వర్ధంతి విజయవంతం చేయండి



సమావేశమైన ఎంపీపీ, ఆదివాసీ నాయకులు

కాసిపేట: ఈ నెల 24న నిర్వహించే ఆదివాసీ అమరుడు చేనేని భీమయ్య వర్ధంతిని విజయవంతం చేయాలని ఎంపీపీ రోడ్డ లక్ష్మి, ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని మద్దిమాడలో ఆదివారం వర్ధంతి నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరి, ఈ సంవత్సరం సైతం మండలంలోని అన్ని కులసంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరై ఘనంగా నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమంలో మద్దిమాడ మాజీ సర్పంచ్ ఆడ జంగు, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, రోడ్డ రమేష్, ఆదివాసీ సంఘాల నాయకులు సంద్ర భూమన్న, బద్ది శ్రీనివాస్, మహేందర్, రెడ్డి లక్ష్మణ్, మద్దిమాడ గ్రామకమిటీ సభ్యులున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావ్

నస్పూర్: పెద్దపెల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలంటూ మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావ్ ఆదివారం నస్పూర్ మున్సిపాలిటీలోని 20వార్డు సీతారాంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ప్రకటనలు చేసి గద్దెనెక్కిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, గరిసె రామస్వామి, పట్టణ ఉపాధ్యక్షుడు రామన్న, కౌన్సిలర్ వంగ తిరుపతి, శంకర్, జనార్దన్, సత్తన్న, రాయలింగు, సంపత్‌రావ్, మల్లిఖార్జున్, పోషం, రామన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడేస్తా.. ప్రత్యర్థులను ఓడిస్తా



బ్యాటింగ్ చేస్తున్న కొప్పుల ఈశ్వర్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా సింగరేణి తిలక్ స్టేడియానికి వెళ్లి వాకర్స్‌తో కలిసి నడక సాగించి, ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించిన కొప్పుల.. క్రీడా మైదానంలో క్రికెట్ ఆడి రక్తి కట్టించారు.

నేడు హాజీపూర్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించనుంది. అనంతరం అటవీ నర్సరీ ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన తాజా మాజీ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పలువురు సీనియర్ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. వీరంతా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరనుండగా ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్‌వెంకటస్వామి, గడ్డం వినోద్‌లతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కూడా కార్యక్రమానికి హాజరవుతున్నారు. మండలంలో జరగనున్న ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతుండగా, ఎవరెవెరు పార్టీలో చేరుతున్నారనే విషయాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఇప్పటికే హాజీపూర్ మండలంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా ఈ భారీ చేరికలతో మండలంలో ప్రధానంగా బీఆర్‌ఎస్ ఖాళీ కాబోనుందని ప్రచారం జరుగుతోంది.

వైభవంగా దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు



శివలింగం ప్రతిష్ఠాపన అనంతరం పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట్ రోడ్‌నంబర్ -1లో నూతనంగా నిర్మించిన శివపంచాయతన సహిత అభయాంజనేయ సరస్వతీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా చివరిరోజు స్థాపిత మండప హవనములు, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కళాన్యాసం, ప్రాణప్రతిష్ఠ, దృష్టికుంభం, బలిహరణ, మహాపూర్ణాహుతి, మండప ఉద్వాసన తదితర కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. శ్రీ జగద్గురు శంకరాచర్య పుష్పగిరి పీఠాధిపతులు, వేదపండితులు మధుశంకర్‌శర్మ, కొత్తపల్లి భరద్వాజ శర్మ, శ్రీరాంభట్ల శశాంక్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నడిపెల్లి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మాజీవైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ తదితరులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



నాగవెల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న దంపతులు



పెళ్లి కాని యువతులకు వాయినాలు ఇస్తూ..

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ కోదండ రామాలయంలో శనివారం సీతారామ చంద్రమూర్తిల నాగవెల్లి వైభవోపేతంగా కొనసాగింది. ఆదివారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పెళ్లి కానీ యువతులకు వాయినాలు ఇచ్చారు. పవళింపు సేవ కార్యక్రమంతో శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు హనుమాన్ కల్యాణం



చెన్నూర్: పట్టణంలోని మారుతీ హనుమాన్ మందిర్‌లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్‌కచ్‌వా తెలిపారు. ఉదయం 10:30 గంటలకు కల్యాణం వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ఇప్పలగూడలో ధ్యాన కేంద్రం వార్షికోత్సవం



పాల్గొన్న ధ్యాన కేంద్రం సభ్యులు

కాసిపేట: మండలంలోని ఇప్పలగూడలో ఆదివారం పూలాజీబాబా ధ్యాన కేంద్రం 13వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేశ్లగూడ ధ్యానకేంద్రం అధ్యక్షుడు ఆత్రం భగవంత్‌రావు, మోడీ ధ్యానకేంద్రం అధ్యక్షుడు జానకీరామ్‌లు హాజరయ్యారు. ఆధ్యాత్మిక సత్సంగ విషయాలను తమ అనుభవాలతో భక్తులకు బోధన చేశారు. ధ్యానం చేయాలని, ధ్యాన సాధనతో మంచిజ్ఞానం వస్తుందని, సమాజంలో మంచి వ్యక్తిగా ఎదగవచ్చునన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇప్పలగూడ ధ్యాన కేంద్రం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పెంద్రం రాజు, వివిధ ధ్యానకేంద్రాల నుంచి ధర్మరావుపటేల్, హన్మంతు, దేవ్‌రావ్, భీమన్న, చిన్న భీమయ్య, కొమ్ముల బాపు, పల్లె మల్లయ్య, సంద్ర భూమన్న తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న దీక్షాపరులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని హనుమాన్ మాల దీక్షాపరులు ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ కీర్తనలు పాడుతూ, భజనలు భజనలు ముందుకు సాగారు. హనుమాన్ నామ స్మరణతో గ్రామం మారుమ్రోగింది.

ఆలయాల వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి: మండలంలోని మేదరిపేట శ్రీ లక్ష్మీ నారాయణస్వామి, కాశీవిశ్వేశ్వరాలయం, దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయాల ఏడో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి, శ్రీచక్ర ప్రతిష్ఠాపణ పూజకార్యక్రమాలతో పాటుగా శ్రీ లక్ష్మీనారాయణస్వామివారి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకురాలు లింగాల శ్రీమతి, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

‘గొల్లవాగు ప్రాజెక్ట్‌ను మరిచిన ప్రభుత్వం’

భీమారం: మండల కేంద్రానికి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ప్రాజెక్ట్ వద్ద మాట్లాడుతూ.. ప్రస్తుతం గొల్లవాగు ప్రాజెక్ట్ డెడ్‌స్టోరేజీకి చేరిందన్నారు. దీంతో దీని కిందసాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి రూ.1500కోట్లతో చెన్నూర్ ప్రాంతంలోని చెరువులు, ప్రాజెక్ట్‌లు నింపేందుకు అప్పటి విప్ బాల్క సుమన్ ప్రభుత్వ అనుమతులు కూడా తెచ్చారన్నారు. ఆ నీళ్లు వస్తే గొల్లవాగు ప్రాజెక్ట్‌కు నీటి కొరత ఉండదన్నారు. ఇప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, దీని గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.